@netifocusnews @focustv www.netifocusnews.com
TS-18-0006625
FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం
# నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
COMPLIMENTARY COPY
తెలుగు డిజిటల్ దినపత్రిక
ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | గురువారం 14, మార్చి 2024 | పేజిలు: 04



## బీజేపీ రెండో జాబితా విడుదల

### మొత్తం 72మందికి చోటు

తెలంగాణ నుంచి మరో ఆరుగురికి స్థానం


- ఆదిలాబాద్‌లో సిట్టింగ్ ఎంపి సోయం బాపూరావుకు మొండిచేయి
- మాజీ ఎంపి గోడం నగేశ్‌కు అవకాశం
- మహబూబ్‌నగర్-డికె.అరుణ, మెదక్-రఘునందన్, మహబూబాబాద్-సీతారాం నాయక్, నల్లగొండ-సైదిరెడ్డి, పెద్దపల్లి-గోమాస శ్రీనివాస్
- జితేందర్ రెడ్డిని పక్కన పెట్టిన బిజెపి అధిష్టానం

నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మార్చి13:

బీజేపీ రెండో జాబితా విడుదలైంది. 72 మందితో కూడిన సెకండ్ లిస్టును ప్రకటించగా తెలంగాణ నుంచి ఆరుగురికి చోటు లభించింది. మెదక్ నుంచి రఘునందన్ రావు, నల్గొండ నుంచి సైదిరెడ్డి, పెద్దపల్లి నుంచి గోమాస శ్రీనివాస్, ఆదిలాబాద్ నుంచి గోడం నగేశ్, మహబూబాబాద్ సీతారం నాయక్, మహబూబ్‌నగర్ నుంచి డీకే ఆరుణ పేర్లను బీజేపీ ప్రకటించింది. ఇప్పటికే ఫస్ట్ లిస్టులో 9 సీట్లకు అభ్యర్థులను మిగతా 2లో..



## ఐదేళ్లలో 22,217



### ఎన్నికల బాండ్లు జారీ: ఎస్‌బీఐ

- 22,030 బాండ్లను నగదు రూపంలోకి.. మిగతా సొమ్ము పీఎం సహాయ నిధికి జమ
- సుప్రీంకోర్టుకు ఇచ్చిన అఫిడవిట్‌లో ఎస్‌బీఐ వివరణ..



నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ, మార్చి 13:

ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలు తెలుపుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బుధవారం సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. 2019 ఏప్రిల్ 1 నుంచి.. ఈ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన 2024 ఫిబ్రవరి 15 వరకూ.. 22,217 ఎన్నికల బాండ్లను జారీ చేసినట్టు అందులో వెల్లడించింది. వాటిలో 22,030 బాండ్లను వివిధ రాజకీయ పార్టీలు నగదుగా మార్చుకున్నట్టు తెలిపింది. ఏ ఎలక్టోరల్ బాండ్‌ను ఎవరు కొన్నారు? ఏ రోజు కొన్నారు? దాని విలువ ఎంత? అనే వివరాలన్నింటినీ సుప్రీంకు సమర్పించిన అఫిడవిట్‌లో మిగతా 2లో..



## మరో నలుగురు అభ్యర్థులు

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్



2

## ఇంకుడు గుంతలపై నిర్లక్ష్యం వద్దు

- వేసవిలో తాగునీటి కష్టాలు రాకుండా చర్యలు తీసుకోండి..
- ప్రభుత్వ శాఖలకు హైకోర్టు సూచన

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి 13:

వాన నీటి సంరక్షక వ్యవస్థల (ఆర్‌డబ్ల్యూహెచ్‌ఎస) పట్ల నిర్లక్ష్యం వహిస్తే బెంగళూరులో నెలకొన్నటువంటి తాగునీటి ఎద్దడి పరిస్థితులు హైదరాబాద్‌లోనూ నెలకొనే ప్రమాదం ఉందని హైకోర్టు హెచ్చరించింది. నిబంధనల ప్రకారం రాష్ట్రంలో ఇంకుడు గుంతలు లేని నిర్మాణాలను గుర్తించాలని, తెలంగాణ జల, భూ, వృక్ష చట్టం అమలు చేయాలని, అర్బన్ లోకల్ బాడీలు, గ్రామాల్లో సైతం వాననీటి సంరక్షణ నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2005 నాటి ఒక కేసుపై విచారణ సందర్భంగా హైకోర్టు ఈ ఆదేశాలు మిగతా 2లో..






## సమాజం ఛీత్కరించినా కేసీఆర్‌కు బుద్ధిరాలే..

వివరాలు 02లో..

## తహసీల్దార్ ఇంట్లో ఏసీబీ సోదాలు

- భారీగా బయటపడిన నోట్ల కట్టలు, బంగారం



నేటి ఫోకస్ న్యూస్, కరీంనగర్-మార్చి13:

సంపాదనకు మించిన ఆస్తులు ఉన్నాయనే సమాచారంతో ఏసీబీ కరీంనగర్ జిల్లా జమ్మికుంట తహసీల్దార్ రజిని ఇంటితో పాటు ఆమె బంధువుల ఇళ్లలో 5చోట్ల సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో మిగతా 2లో..

## కేసీఆర్ అత్యాశకు కాళేశ్వరం బలి

- అవినీతి అన్నారం, సుందిళ్లకు కూడా పాకింది
- వెన్నముకలాంటి మేడిగడ్డ కుంగితే పన్నుతో పోలికా
- సమస్యను చిన్నదిగా చేయడం దుర్మార్గం: పొంగులేటి

2



## 2018 గ్రూప్-1 మెయిన్స్ రద్దు

- ఆనాటి మూల్యాంకనపై సందేహాలు
- రద్దుచేస్తూ హైకోర్టు ఆదేశాలు
- అభ్యర్థులకు అండగా ఉంటామని హామీ

2



## వైసీపి ఓడితేనే.. ప్రజలు గెలుస్తారు

- మహిళల కలలకు రెక్కలు కార్యక్రమం ఆవిష్కరణ
- విద్యార్థినుల ఉన్నత చదువులకు రుణాల్లో హామీ
- చదువులు పూర్తయ్యే వరకు వడ్డీమాఫీ
- బస్సుల్లో ఉచిత ప్రయాణానికి హామీ:
- టీడీపీ అధినేత చంద్రబాబు

వివరాలు 02లో..



## కేసీఆర్ పాలనలో దక్షిణ తెలంగాణ ఎడారైంది

- మిషన్ భగీరథ పేరుచెప్పి ప్రజలకు మోసం
- డిండి, ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తే నీటి సమస్య ఉండేది కాదు: మంత్రి కోమటిరెడ్డి

2




నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
గురువారం 14, మార్చి 2024

# కేసీఆర్ అత్యాశకు కాళేశ్వరం బలి

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి13:**

ఒక పన్ను పాడైతే మిగతా అన్ని పళ్లు పీకేసుకుంటామా? ఎన్నికల్లో ప్రజలు అత్యాశకు పోయారా? ముఖ్యమంత్రి భాషపై కరీంనగర్ సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు తప్పు అని తెలంగాణ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం అన్నారు. కేసీఆర్ చెప్పినట్లుగా పాడైంది పన్ను అయితే బాగుండేదని పొంగులేటి శ్రీనివాస్ అన్నారు. కానీ కేసిఆర్ అవినీతికి బలైంది కాళేశ్వరానికి వెన్నెముకలాంటి మేడిగడ్డ అని అన్నారు. మనిషికి వెన్నెముక ఎంత ముఖ్యమో కాళేశ్వరం ప్రాజెక్టుకు మేడిగడ్డ కూడా అంతే ముఖ్యమని అన్నారు. వెన్నెముక విరిగిపోతే శరీరం ఎలా ఉంటుందో ఇప్పుడు కాళేశ్వరం పరిస్థితి కూడా అలాగే ఉందని పొంగులేటి అన్నారు. అపర మేధావి కేసీఆర్ సమస్యను చిన్నదిగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎత్తిపోతల, తిప్పిపోతల అంటూ కాళేశ్వరం ప్రాజెక్ట్ వెన్నెముక అయిన మేడిగడ్డ బ్యారేజీ మొత్తం 22 పిల్లర్లలో దాదాపు 7 పిల్లర్లు 3 ఫీట్ల మేరకు కుంగిపోయాయని అన్నారు. ఈ విషయాన్ని ఎన్ఎస్డీఏ, కేంద్ర ప్రభుత్వ జల వనరుల నిపుణులు, మన ప్రభుత్వ నిపుణులు, రిటైర్డ్ ఇంజనీరింగ్ అధికారులు, మేధావులు, రైతు సంఘాల నేతలు, ప్రజా ప్రతినిధులు, వివిధ పత్రికల ఎడిటర్లు, జర్నలిస్ట్ లు ఇలా ప్రజలు అందరూ ఏకరువు పెడుతున్నారని అన్నారు. ప్రజలు అత్యాశకు పోయారని ప్రజాతీర్పును కేసీఆర్ చులకన చేస్తున్నారని, తనకు ఓటు వేసినంత కాలం ప్రజలు మంచివారు, వ్యతిరేకంగా ఓటు వేస్తే మాత్రం ప్రజలకు తెలివి లేదు మూర్ఖులు అన్నట్లుగా కేసిఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా తీర్పును ఆమోది స్తున్నామని ఈరోజు వరకు కేసీఆర్ నోటినుండి వెలువడిందా? ప్రజా తీర్పును ప్రశ్నించేలా కేసీఆర్ మాట్లాడడం ఎంత వరకు సమంజసం అన్నారు.కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టోను కాపీ చేసి 400కు సిలిండర్ ఇస్తానంటే కూడా కేసీఆర్ హామీలను ప్రజలు నమ్మలేదని పొంగులేటి అన్నారు. మేడిగడ్డ తర్వాత అన్నారం సుందిళ్ల పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందని పొంగులేటి అన్నారు. కేసీఆర్ అవినీతి జబ్బు ఒక మేడిగడ్డకే పరిమితం కాలేదని.. అన్నారం సుందిళ్ళకు కూడా పాకిందని అన్నారు. తానే ఇంజనీర్, తానే డిజైనర్, తానే తాపీ మేస్త్రి అనే విధంగా వ్యవహరించారని కాళేశ్వరం కెసిఆర్ అవినీతి అహంకారానికి మూర్ఖత్వానికి నిదర్శనం అని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీ తర్వాత అన్నారం బ్యారేజీ, సుందిళ్ల ప్రాజెక్టుల పరిస్థితి కూడా చాలా ఆందోళనకరంగా ఉంది. కేసీఆర్ అవినీతి జబ్బు ఒక మేడిగడ్డకే పరిమితం కాలేదు. ఆ జబ్బు అన్నారం సుందిళ్ళకు కూడా పాకింది. తానే ఇంజనీర్, తానే డిజైనర్, తానే తాపీ మేస్త్రి అనే విధంగా వ్యవహరించారు. కాళేశ్వరం కేసీఆర్ అవినీతి అహంకారానికి మూర్ఖత్వానికి నిదర్శనం' అని పొంగులేటి విమర్శించారు. శాసనసభలో సాగునీటి ప్రాజెక్టులపై జరిగిన చర్చలు పాల్గొనకుండా పారిపోయిన పెద్దమనిషి 80వేల పుస్తకాలు చదివిన మేధావి కాళేశ్వరం రూపశిల్పి ఇప్పుడు టీవీల ముందుకు వచ్చి మాట్లాడుతారంట అని ఎద్దేవా చేశారు. భూమి ఆకాశం ఉన్నన్నిరోజులు బీఆర్ఎస్ ఉంటుందన్న కేసీఆర్ వ్యాఖ్యలపై స్పందించారు. టీఆర్ఎస్ స్థానంలో కెసిఆర్ ఏర్పాటు చేసిన భారత రాష్ట్ర సమితి పరిస్థితి ఏమైందో అందరికీ తెలుసని, దేశంలో గత్తెర లేప్త భూకంపం సృష్టిస్తా అని చెప్పిన వ్యక్తి దేశంలో ఏ ఒక్క రాష్ట్రంలో పోటీ చేయలేక చేతులెత్తేయగా, ఉన్న రాష్ట్రంలో ప్రజలు కెసిఆర్ కుర్చీ మడత పెట్టారని, రాబోయే రోజుల్లో ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా బీఆర్ఎస్ కు అభ్యర్థులు దొరకలేని పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. కేసిఆర్ పాలనలో జరిగిన పాలనపరమైన తప్పిదాలను కాంగ్రెస్ ప్రభుత్వంపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. కరువుకు కాంగ్రెస్ పార్టీకి ఏమైనా సంబంధం ఉందా ? మా ప్రభుత్వం డిసెంబర్ 7వ తేదీన ఏర్పడిందని, అప్పటికే వర్షాకాలం సీజన్ ముగిసిందనే విషయాన్ని కేసిఆర్ గుర్తుంచుకోవాలని పొంగులేటి అన్నారు.

# సమాజం ఛీత్కరించినా కెసిఆర్‌కు బుద్ధిరాలేద..

**నేటి ఫోకస్ న్యూస్, కరీంనగర్-మార్చి13:**

కేసీఆర్ ను తెలంగాణ సమాజం ఛీత్కరించిన బుద్ధిరాలేదని బీజేపీ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. పచ్చి అబద్ధాలు, అభూతకల్పనలతో మళ్లీ ప్రజలను నమ్మించే యత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్ కదనభేరి సభలోకేసీఆర్ మాట్లాడిన వ్యాఖ్యలకు సంజయ్ కౌంటర్ ఇచ్చారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడారు. కేంద్రం నిధులు ఇచ్చినా బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ మ్యాచింగ్ గ్రాంట్ ఎందుకు ఇవ్వలేదని బిజెపి ఎంపి బండి సంజయ్ ప్రశ్నించారు. కేంద్రం నిధులను కెసిఆర్ ఇతర కార్యక్రమాలకు మళ్లించారని, నిధుల మళ్లింపుపై గతంలో కేంద్రం లేఖలు రాసిందని, కేంద్రం రాసిన లేఖలకు అప్పటి ప్రభుత్వం ఎందుకు బదులివ్వలేదని బండి సంజయ్ నిలదీశారు. కరీంనగర్‌కు స్మార్ట్ సిటీ హోదా ఇచ్చిందని బిజెపి అని తెలియజేశారు. కేంద్రం మూడు సార్లు లేఖలు రాసినా కెసిఆర్ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని అడిగారు. కేంద్రం స్మార్ట్ సిటీ ఇస్తే తామే తెచ్చామని కెసిఆర్ అబద్ధాలు చెబుతున్నారని బండి సంజయ్ దుయ్యబట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులే కరువయ్యారని.. ఆ పార్టీలోని నేతలంతా ఇతర పార్టీలవైపు చూస్తున్నారని విమర్శించారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్ నిజాయితీపరుడైతే రూ.500 కోట్ల విలువైన భూదాన్ భూముల స్వాధీనంపై నోరెందుకు మెదపలేదని కేసీఆర్‌ను సంజయ్ ప్రశ్నించారు. కేసీఆరే పెద్ద అవినీతిపరుడంటూ సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాత అంశాలను తోడి సెంటిమెంట్ ను రెచ్చగొట్టేందుకు కేసీఆర్ కుట్ర చేస్తున్నారన్ని ÷రైయ్యారు. భద్రాచలంలోని 7 మండలాలను ఏపీలో విలీనానికి ఓకే చెప్పిందే కేసీఆర్ అంటూ సంజయ్ ఆరోపించారు. అప్పాల్ 7 మండలాలు పోతే పోనీ.. తెలంగాణ వస్తుంది కదా అన్నదే కేసీఆర్ అని అన్నారు. కరీంనగర్ కు స్మార్ట్ సిటీ నిధులు కేసీఆర్ ఇచ్చిండా? కేంద్రం కదా మంజూరు చేసిందా అని సంజయ్ ప్రశ్నించారు. కేంద్రం స్మార్ట్ సిటీ కింద కేంద్రం రూ.196 కోట్లు మంజూరు చేస్తే రాష్ట్రం మ్యాచింగ్ గ్రాంట్ కింద అదనంగా రూ.196 కోట్లు ఆనాడు ఎందుకు విడుదల చేయలేదని నిలదీశారు. స్మార్ట్ సిటీ నిధులను కేసీఆర్ ప్రభుత్వం దారి మళ్లిస్తే తాను కేంద్రానికి ఫిర్యాదు చేశానని చెప్పారు.లక్ష ఓట్లతో లక్షణంగా ఓడిపోయిన చరిత్ర వినోద్ కుమార్ ది అని విమర్శించారు బండి సంజయ్. కేసీఆర్ ముఖాన్ని జనం ఛీత్కరించారు.. వినోద్ ముఖానికి ఓట్లు పడే పరిస్థితి లేదన్నారు. పార్లమెంట్ లో 106 సార్లు మాట్లాడి వినోద్ కుమార్ సాధించేదేమిటని ప్రశ్నించారు. కరీంనగర్ -వరంగల్, కరీంనగర్-జగిత్యాల, ఎల్కతుర్తి-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణకు నిధులెందు కు తీసుకురాలేదన్నారు. ఆ రోడ్ల విస్తరణ కోసం కేంద్రాన్ని ఒప్పించి దాదాపు రూ.5 వేల కోట్ల నిధులను తాను తీసుకొచ్చినని బండి తెలిపారు.

# ఐదేళ్లలో 22,217 ఎన్నికల బాండ్లు..




(మొదటి పేజీ తరువాయి..)

పొందుపరచినట్టు ఎస్‌బీఐ తెలిపింది. ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలను ఎన్నికల సంఘానికి సమర్పించాలంటూ ఫిబ్రవరి 15న తాము ఇచ్చిన తీర్పు అమలుపై తీసుకున్న చర్యల గురించి వివరిస్తూ ఎస్‌బీఐ చైర్మన్, ఎండీ అఫిడవిట్ దాఖలు చేయాలంటూ సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. ఈమేరకు ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్‌కుమార్ ఖారా ఈ అఫిడవిట్‌ను కోర్టుకు సమర్పించారు. తాము జారీ చేసిన ఎలక్టోరల్ బాండ్లను ఏ పార్టీ, ఏ తేదీన నగదు గా మార్చుకుందనే వివరాలను ఈసీకి సమర్పించిన ట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దానిప్రకారం.. 2019 ఏప్రిల్1 నుంచి ఏప్రిల్11 నడుమ 3,346 ఎన్నికల బాండ్లు జారీ చేయగా వాటిలో 1,609 బాండ్లను పార్టీలు నగదుగా మార్చుకోగా..

2019 ఏప్రిల్12 నుం చి 2024 ఫిబ్రవరి15 నడుమ 18,871 బాండ్లు జారీకాగావాటిలో 20,421 బాండ్లను పార్టీలు నగదు చేసుకున్నాయి. ఎలక్టోరల్ బాండ్లను పొందిన రాజకీయ పార్టీలు వాటిని 15రోజుల్లోగా నగదుగా మార్చుకోకుంటే ఆమొత్తం ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధికి బదిలీ చేయాల్సి ఉంటుంది. ఈమేర కు.. పార్టీలు నగదుగా మార్చుకోని 187బాండ్లను రిడీమ్ చేసి పీఎం జాతీయ సహాయనిధికి జమచేసినట్టు ఎస్‌బీఐ తన అఫిడవిట్‌లో పేర్కొంది. కాగా.. ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని దేశ అత్యున్నత న్యాయ స్థానం ఇచ్చిన తీర్పుపై ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్ కోరాలంటూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) అధ్యక్షుడు ఆదిష్ సి అగర్వాలా.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కు లేఖ రాయడాన్ని బార్ అసోసియేషన్ ఖండించింది. అధ్యక్షుడు అలా లేఖ రాయడానికి తామె లాంటి అధికారమూ ఇవ్వలేదని.. అందులో ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలను తాము సమర్థించట్లేదని అందులో తేల్చిచెప్పింది. ఆదిష్ సి అగర్వాలా లేఖ.. సుప్రీంకోర్టు అధికారాలను తగ్గించేలా ఉందని, దాన్ని తాము నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నామని పేర్కొంది. కాగా ఎస్‌బీఐ నుంచి ఎన్నికల బాండ్ల వివరాలు అందాయని, వాటిని సుప్రీం ఆదేశాల మేరకు నిర్ణీతసమయంలోగా తమ వెబ్‌సైట్‌లో ప్రచురిస్తామని సీఈసీ రాజీవ్‌కుమార్ జమ్ములో తెలిపారు.

# బీజేపీ రెండో జాబితా విడుదల

(మొదటి పేజీ తరువాయి..)

ప్రకటించిన బీజేపీ తాజా జాబితాతో తెలంగాణలో మొత్తం 15 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. వరంగల్, ఖమ్మం స్థానాలను పెండింగ్ లో పెట్టింది. వరంగల్ నుంచి ఆరూరి రమేష్ పేరు ఖరారు అయినప్పటికీ చివరి నిమిషంలో ఆయన కేసీఆర్ తో భేటీ అయ్యారు. ఇక ఖమ్మం నుంచి జలగం వెంకట్రావ్ పేరును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్ సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు, మహబూబ్ నగర్ సీటు ఆశించిన జితేందర్ రెడ్డిలకు అధిష్టానం బిగ్ షాకిచ్చింది. మొత్తం 10 రాష్ట్రాలతో పాటు దాద్రా నగర్ హవేలికి సంబంధించిన అభ్యర్థులనూ బీజేపీ ప్రకటించింది. ఢిల్లీ(2), గుజరాత్(7), హరియాణా(6), హిమాచల్ ప్రదేశ్(2), కర్ణాటక(20), మధ్యప్రదేశ్(5), మహారాష్ట్ర(20), త్రిపుర(1), ఉత్తరాఖండ్(2), దాద్రా నగర్ హవేలి(1) స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. బీజేపీ ఇప్పటికే ఈ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాని విడుదల చేసిన విషయం తెలిసిందే. మొత్తం 195 మంది అభ్యర్థులతో కూడిన ఆ తొలి జాబితాలో తెలంగాణ నుంచి మొత్తం 9 మంది చోటు సంపాదించారు. ఇప్పుడు తాజాగా ఆ పార్టీ 72 మంది అభ్యర్థులతో కూడిన రెండో జాబితాని విడుదల చేసింది. ఇందులో ఆరుగురు తెలంగాణ అభ్యర్థులు స్థానం దక్కించుకున్నారు. ఆదిలాబాద్‌లో సిట్టింగ్ ఎంపిని కాదని బిఆర్ఎస్ నుంచి వచ్చి చేరిన మాజీ ఎంపి గోడం నగేశ్‌కు స్థానం కల్పించారు. అలాగే మహబూబాబాద్‌లో కూడా మాజీ ఎంపి సీతారాం నాయక్ ఇటీవలే బిజెపిలో చేరగా ఆయనకు కూడా టిక్కెట్ కేటాయించారు. నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే శానం సైదిరెడ్డికి టిక్కెట్ ఇవ్వడం గమనార్హం. ఇతర పార్టీల నుంచి వచ్చి చేరిన వారికే టిక్కెట్లు కేటాయించారు. అందరూ ఊహించినట్లుగానే మెదక్ ఎంపి సీటును రఘునందన్ రావుకు కేటాయించారు. ఇప్పటికే మల్కాజిగిరి స్థానాన్ని ఈటెల రాజేందర్‌కు కేటాయించారు.

# మరో నలుగురు అభ్యర్థులు..

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి 13:**

రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మరో నలుగురు అభ్యర్థులను బీఆర్ఎస్ ప్రకటించింది. చేవెళ్ల నుంచి ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్, వరంగల్ నుంచి ఎంపీ అభ్యర్థిగా కడియం కావ్య, జహీరాబాద్ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్, నిజామాబాద్ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్‌లను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారు. ముఖ్య నేతలతో జరిపిన చర్చల అనంతరం అభ్యర్థులను ప్రకటించారు. తాజాగా నలుగురు అభ్యర్థుల ప్రకటనతో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థుల జాబితా తొమ్మిదికి చేరింది. ఇంకా 8 ఎంపీ స్థానాలకు అభ్యర్థులను బీఆర్ఎస్ ప్రకటించాల్సి ఉంది. కాగా, తొలి జాబితాలో బీఆర్ఎస్. ఐదుగురు అభ్యర్థులను ప్రకటించింది. ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ నామా నాగేశ్వర్‌రావు, మహబూబాబాద్ (ఎస్టీ రిజర్వ్) స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవిత, కరీంనగర్ నుంచి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి (ఎస్సీ రిజర్వ్) స్థానం నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, )మహబూబ్ నగర్-మన్నె శ్రీనివాస్ రెడ్డిలను ఖరారు చేసింది.

# ఇంకుడు గుంతలపై నిర్లక్ష్యం వద్దు

(మొదటి పేజీ తరువాయి..)

జారీ చేసింది. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉందని.. తాగునీటి వినియోగాన్ని నియంత్రించేలా, నీటి సంరక్షణ చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని పేర్కొంటూ జర్నలిస్టు పీఆర్ సుభాష్ చంద్రన్ 2005లో హైకోర్టుకు లేఖ రాశారు. సదరు లేఖను సుమోటోగా స్వీకరించిన అప్పటి హైకోర్టు.. తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం కోసం నిపుణుల కమిటీని నియమించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి పలు కీలక సూచనలతో కూడిన నివేదికను హైకోర్టుకు సమర్పించింది. కాగా ఈ పిటిషన్ బుధవారం మరోసారి చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది వీ సిద్ధివర్ధన వాదనలు వినిపిస్తూ.. ఈ పిటిషన్‌కు కాలం చెల్లిపోయిందని.. నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే విషయంలో నిబంధనలు పాటిస్తున్నామని తెలిపారు. ఈ కేసులో అమికస్ క్యూరీ (కోర్టు సహాయకులు)గా ఉన్న సీనియర్ న్యాయవాది దేశాయి ప్రకాశ్‌రెడ్డి.. ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి ఎద్దడి లేకుండా తీసుకోవాల్సిన చర్యలు, నిపుణుల కమిటీ సూచనలు, చట్టాల అమలు గురించి ధర్మాసనానికి వివరించారు. పిటిషన్‌కు కాలం చెల్లిపోయిందన్న ప్రభుత్వ వాదనను ఆమోదించలేమని పేర్కొన్న ధర్మాసనం.. నిర్లక్ష్యం వహిస్తే హైదరాబాద్‌లోనూ బెంగళూరు తరహాలో తాగునీటి కటకట ఏర్పడుతుందని హెచ్చరించింది. వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంటూ.. వివిధ ప్రభుత్వ శాఖలకు హైకోర్టు పలు మార్గదర్శకాలను జారీ చేసింది.

# తహసీల్దార్ ఇంట్లో ఏసీబీ సోదాలు

(మొదటి పేజీ తరువాయి..)

అధికారులకు షాక్ తగిలేల నోట్ల కట్టలు బయటపడ్డాయి. ఉదయం నుంచి కొనసాగిన ఈ సోదాల్లో.. 3 కోట్ల 20 లక్షల విలువైన ఆస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు. అంతే కాకుండా ఏడెకరాల వ్యవసాయ భూమితో పాటు భారీగా ఓపెన్ ప్లాట్లు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. వాటితో పాటు 1.4 కిలోల బంగారు ఆభరణాలు, లక్ష 40 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. దీంతో తహసీల్దార్ రజినికి కరీంనగర్ కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది.

# వైసీపి ఓడితేనే.. ప్రజలు గెలుస్తారు

**నేటి ఫోకస్ న్యూస్, అమరావతి-మార్చి13:**

టిడిపి హయాంలో డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహిళల్లో చైతన్యం తీసుకొచ్చామని.. ఇప్పుడు అవి ప్రపంచానికే ఆదర్శమయ్యాయని తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి అభివృద్ధి చెంది, పోలవరం పూర్తయి ఉంటే రాష్ట్రానికి పరిశ్రమలు వచ్చి ఈపాటికి ఎక్కడో ఉండేవాళ్లం అన్నారు. ఈ రకంగా ఎపి పూర్తిగా వెనక్కి నెట్టబడిందన్నారు. విద్యా రాజధానిగా ఎదగాల్సిన రాష్ట్రం సర్వనాశనమైంది. ప్రజలు గెలవాలంటే వైకాపా ఓడి తీరాలని చంద్రబాబు అన్నారు. ఉండవల్లిలోని తన నివాసంలో 'కలలకు రెక్కలు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెదేపా కూటమి అధికారంలోకి రాగానే 'మహాశక్తి' కింద ఐదు కార్యక్రమాలు తీసుకొస్తామన్నారు. 'తల్లికి వందనం' పేరుతో ఏడాదికి రూ.15 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు వచ్చాయంటే ఎన్టీఆర్ చొరవే అని వివరించారు. తెదేపా హయాంలో 22 కొత్త పథకాలు తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు. ఒకప్పుడు ఐటీ అని తానంటే అందరూ నవ్వారని.. ఇప్పుడు ఆ రంగంలో ప్రపంచమంతా మనవాళ్లు ఉన్నారన్నారు. తెదేపా హయాంలో ఉద్యోగాలు, కళాశాల సీట్లలో రిజర్వేషన్లు తీసుకొచ్చాం. ఆడబిడ్డలకు రిజర్వేషన్లతో ప్రస్తుతం మగవారితో సమానంగా పని చేస్తున్నారు. మెరుగైన అవకాశాలిస్తే మరింత ముందుకెళ్తారు. ఉజ్వల భవిష్యత్తు కోసం ఆలోచించి ఆచరణ సాధ్యం చేసే పార్టీ తెలుగుదేశం. పిల్లల భవిష్యత్తు కోసం తెదేపా హయాంలో తీసుకొచ్చిన పథకాలతో ఎంతో మంది విదేశాలకు వెళ్లి స్థిరపడ్డారు. 'కలలకు రెక్కలు' వినూత్న కార్యక్రమం. మహిళలకు ఉండే అవకాశాలను గుర్తించి దీన్ని ప్రత్యేకంగా రూపొందించాం. నైపుణ్యాభివృద్ధి కోసం ఆడపిల్లలకు ఎంతైనా ఖర్చు పెట్టే పథకమిది. విద్యార్థినుల ఉన్నత చదువుల కోసం బ్యాంకు రుణాలు తీసుకునేలా మేం సహకరిస్తాం. వీటికి ప్రభుత్వమే వడ్డీ కడుతుంది. ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలి.. 2024 ఎన్నికల్లో జరగబోయేదిదే. భారత్‌లో ఆర్థిక సంస్కరణల వల్ల పెట్టుబడిదారులు పెరిగారు. దేశంలో యువత అధికంగా ఉండటం కలిసొచ్చే అంశం. ప్రధాని మోదీ చెబుతున్న వికసిత్ భారత్‌అ2047 జరిగి తీరుతుంది. జగన్ పాలనలో జరిగిన విధ్వంసం వల్ల రాష్ట్రంలో ఏ వ్యవస్థా సక్రమంగా లేదు. రైతులు, యువత, కార్మికులు నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాలు నలిగిపోయాయని చంద్రబాబు ఆవేదన చెందారు. ఈ క్రమంలో మహిళల కోసం సరికొత్త పథకం 'కలలకు రెక్కలు' పేరుతో కొత్త కార్యక్రమానికి తెలుగు దేశం శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రారంభించారు. విద్యార్థినులు తమ పేర్లు రిజిస్టర్ చేసుకునే కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల కోసం టీడీపీ మొదటి నుంచి అనేక వినూత్న కార్యక్రమాలు చేపట్టిందన్నారు. టీడీపీ సూపర్ సిక్స్‌లో మహాశక్తి కార్యక్రమంతో మహిళా సంక్షేమం చేపట్టబోతున్నట్టు ఆయన చెప్పారు. గతంలో దీపం పథకం ప్రవేశపెట్టింది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. సూపర్ సిక్స్‌లో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు చెప్పారు. చదువుకోవాలని అనుకున్న ఆడపిల్లలకు ఆర్థిక పరిస్థితులు అనుకూలించక.. ఇంటికే పరిమితం కాకూడదన్న ఆశయంతో 'కలలకు రెక్కలు' అనే పథకానికి శ్రీకారం చుట్టామని చంద్రబాబు తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసుకున్న ఆడబిడ్డలు పై చదువులు చదువుకునేందుకు బ్యాంక్ లోన్‌ల ద్వారా అవకాశం కల్పిస్తామన్నారు. వారు తీసుకునే రుణాలకు ప్రభుత్వమే పూచీకత్తుగా ఉంటుందని, అంతేకాకుండా కోర్సు కాలానికి ఋణంపై వడ్డీ కూడా ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. మహిళలను మహాశక్తులుగా మార్చేందుకు టీడీపీ హామీ ఇచ్చిందే మహాశక్తి పథకమని చంద్రబాబు పేర్కొన్నారు. కాగా ఇప్పటికే పేరు నమోదు చేసుకోవడం కోసం వెబ్‌సైట్‌ను టీడీపీ రూపొందించింది.

# కేసీఆర్ పాలనలో దక్షిణ తెలంగాణ ఎడారైంది

**నేటి ఫోకస్ న్యూస్, నల్గొండ-మార్చి13:**

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని.. ఊళ్లకు పోతే నీళ్ల సమస్యలతో కళ్ళలో నీళ్లు వస్తున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. మంచినీటి సమస్యను తీర్చకుండానే మిషన్ భగీరథ పేరుతో కెసిఆర్ ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. డబ్బుల ఆశతో కేసీఆర్ అల్లుడు, కొడుకులు... హైదరాబాద్‌లో టానిక్ షాపులు, ఢిల్లీలో మందు షాపులు, కాళేశ్వరం పేరుతో దోపిడీ చేసి దక్షిణ తెలంగాణను నాశనం చేశారని విమర్శించారు. అందుకే రిజల్ట్ వచ్చిన రోజే కేసీఆర్ నడుము విరగ్గొట్టి దేవుడు శిక్ష వేశారన్నారు. డిండి, ఎస్ఎల్ బీసీ పూర్తి చేస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. రోజుకు నలుగురు పార్టీ మారుతుంటే బీఆర్ఎస్ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. కేసీఆర్ దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానన్న మొదటి హామీనే అమలు చేయలేదన్నారు. బీఆర్ఎస్ మొదటి ఐదేళ్లలో మహిళా మంత్రి లేని రాష్ట్రం కాబట్టే వారి ఉసురు తగిలి కరువు వచ్చిందని వ్యాఖ్యలు చేశారు. అన్ని వర్గాలకు న్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీనే అని అన్నారు. చచ్చిన పాము లాంటింది బీఆర్ఎస్ పార్టీ.... ఎంపీ ఎన్నికల్లో ఈసారి ఒక్క సీటూ రాదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. కెసిఆర్ నిర్ణయాలతో దక్షిణ తెలంగాణ సర్వనాశనం అయ్యిందన్నారు. నల్గొండ మున్సిపాలిటీలో తాగునీటి సమస్యలపై రివ్యూ నిర్వహించారు. పానగల్ లోని తాగునీటి శుద్ధ కర్మాగారాన్ని పరిశీలించిన కోమటిరెడ్డి అధికారులకు సూచనలు జారీ చేశారు.

ఏఊరికి వెళ్లినా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని చెప్పారు. మిషన్ భగీరథతో నీళ్లిచ్చామని చెప్పడం అబద్ధమన్నారు. డిండి, ఎస్ఎబిసి పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేద కాదని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ప్రతి రోజు నలుగురు నేతలు పార్టీ మారుతున్నారని..తర్వలో బీఆర్ఎస్ ఖాళీ అవుతుందన్నారు . అన్నివర్గాలకు న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీనేనన్నారు. మహాత్మాగాంధీ వర్సిటీలోని ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇటీవల జరిగిన జాబ్ మేళాలో ఆరు వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని తెలియజేశారు. మే నెలలో నల్లగొండలో మరో జాబ్ మేళా నిర్వహిస్తామని చెప్పారు. నల్లగొండలో పలు అభివృద్ధి పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నల్లగొండను ఉత్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. రూ.600 కోట్లతో చేపట్టే నల్లగొండ ఒఆర్ఆర్ పనులకు వచ్చే నెల టెండర్లకు పిలుస్తామని, ఆరు వరసల రోడ్డు పనులకు ఆగస్టు 15 నాటికి పూర్తి చేస్తామని మంత్రి వివరించారు. రోడ్డు, డ్రైయిన్ల పనులు నాణ్యతపై రాజీపడవద్దని కాంట్రాక్టర్లకు ఆదేశించామన్నారు.

# 2018 గ్రూప్-1 మెయిన్స్ రద్దు

**నేటి ఫోకస్ న్యూస్, అమరావతి-మార్చి13:** 2018లో ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షపై రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పు వెలువ రించింది. గతంలో జరిగిన మెయిన్స్ పరీక్షను రద్దు చేసింది. జవాబు పత్రాలను మాన్యువల్ విధానంలో రెండుసార్లు మూల్యాంకనం చేశా రంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. మొదటిసారి దిద్దిన ఫలితాలను తొక్కిపెట్టి, రెండోసారి దిద్దించి నచ్చిన వారిని ఎంపిక చేసుకొని ఏపీపీఎస్సీ ఫలితాలు ప్రకటించిందని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. మెయిన్స్ జవాబు పత్రాలను పలుమార్లు మూల్యాంకనం చేయడం చట్టవిరుద్ధమని హైకోర్టు పేర్కొంది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను రద్దు చేసిన ఉన్నత న్యాయస్థానం.. మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఆదేశించింది. ఎంపిక ప్రక్రియను 6 వారాల్లోపు పూర్తిచేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. 2018 గ్రూప్-1 నోటిఫికేషన్ ఆధారంగా మెయిన్స్ పరీక్ష రాసి ఎంపికైన అభ్యర్థుల జాబితాను రద్దు చేసింది. పరీక్ష పేపర్లను రెండవసారి, మూడవసారి మూల్యాంకనం చేయడం చట్టవిరుద్ధమని హైకోర్ట్ ప్రకటించింది. పరీక్షను తాజాగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. పరీక్ష నిర్వహణ, ఎంపిక ప్రక్రియను 6 వారాల్లో పూర్తి చేయాలని స్పష్టం చేసింది. అయితే 2018 గ్రూప్-1పై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అభ్యర్థులు ఆందోళన చెందవద్దని ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ఆ నోటిఫికేషన్ కింద ఎంపికై ఉద్యోగాలు చేసుకుంటున్నవారి ప్రయోజనాలను కాపాడు తామని హామీ ఇచ్చింది. వారి తరపున న్యాయపోరాటం చేస్తామని, హైకోర్టు తీర్పుపై అప్పీలుకు వెళ్తామని హామీ ఇచ్చింది. తీర్పుపై ఎవరికీ ఆందోళన అవసరం లేదని, వారి ప్రయోజనాలను పరిరక్షిస్తామని ఈ సందర్భంగా పేర్కొంది.

# ఆరూరి ఇంటివద్ద హైడ్రామా

- రమేష్ మీడియా సమావేశాన్ని అడ్డగింత
- పార్టీ మారవద్దంటూ ఎర్రబెల్లి, సారయ్యల వినతి
- బలవంతంగా ఆరూరిని కారులో ఎక్కించుకుని వెళ్లిన ఎర్రబెల్లి
- పెంబర్తి వద్ద ఎర్రబెల్లి కారును అడ్డుకున్న బిజెపి కార్యకర్తలు



నేటి ఫోకస్ న్యూస్, హన్మకొండ–మార్చి13:

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ ఇంటి వద్ద హైడ్రామా చోటుచేసుకుంది. బిజెపీలో చేరేందుకు నిర్ణయించుకుని, ప్రెస్ మీట్ పెట్టిన ఆరూరిని బిఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి దయాకరరావు, ఎమ్మెల్సీ సారయ్య తమ కారులో ఎక్కించుకుని తీసుకువెళ్లిపోవడంతో ఆరూరి అనుచరులు నిశ్చేష్టులయ్యారు. ఆరూరి బిజెపీలో చేరతారని కొంతకాలంగా వార్తలు వెలువడుతున్నాయి. వీటిని నిజం చేస్తూ మంగళవారం ఆయన హైదరాబాద్ లో అమిత్ షాను కలుసుకుని, పార్టీలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈమేరకు తాను పార్టీలో చేరుతున్న విషయాన్ని మీడియాకు చెప్పేందుకు బుధవారం ఉదయం విలేఖరులను ఆహ్వానించారు. మరికాసేపట్లో సమావేశం మొదలవుతుం దనగా, బిఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి, సారయ్య రంగంలోకి దిగారు. పార్టీలోనే ఉండాలంటూ ఆరూరికి నచ్చజెప్పేం దుకు ప్రయత్నించారు. ఆరూరి ససేమిరా అనడంతో ఆయనను తమతోపాటు తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో ఆరూరి అనుచరులు వారి కారుకు అడ్డంపడ్డారు. కొంతసేపు ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరువైపులా పోటాపోటీ నినాదాలు కొనసాగాయి. చివరకు ఆరూరితో సహా ఎర్రబెల్లి, సారయ్య సంఘటన స్థలంనుంచి నిష్క్రమించారు. ఆరూరిని జనగామలో ఉన్న హరీశ్ రావు వద్దకు తీసుకువెళ్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ఆరూరిని బుజ్జగించి పార్టీలోనే కొనసాగించే బాధ్యతను హరీశ్ రావు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జనగామ జిల్లా పెంబర్తి దగ్గర ఉద్రిక్తత నెలకొంది. ఆరూరి రమేష్ ను ఎర్రబెల్లి హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా వాహనాన్ని బీజేపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. కారులోంచి ఆరూరిని లాగేందుకు ప్రయత్నించారు. దీంతో బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో ఆరూరి రమేష్ చొక్కా చినిగిపోయింది. ఇరు పార్టీల కార్యకర్తలు పోటాపోటీ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డితో ఆరూరి రమేశ్ ఫోన్లో మాట్లాడారు. తనను ఎవరూ బలవంతంగా తీసుకెళ్లడు లేదని.. వ్యక్తిగత పనిమీద వెళుతున్న మాట్లాడి వస్తానని కిషన్ రెడ్డికి రమేశ్ సమాధానం ఇచ్చారు. అనంతరం అక్కడి నుంచి ఎర్రబెల్లి దయాకర్ వాహనం ఎక్కి రమేష్ వెళ్లిపోయారు. మంగళవారం హైదరాబాద్ లో కేంద్ర హోమంత్రి అమిత్ షాను కలిసిన ఆరూరి..ఇవాళ పార్టీకీ రాజీనామా చేసేందుకు సిద్దమై ప్రెస్ మీట్ పెట్టారు. ఈలోపు అక్కడికి చేరుకున్న ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి పార్టీలోని ఉండాలని నచ్చజెప్పేందుకు ప్రయత్నించడంతో డ్రామాకు తెరతీసారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఆరూరికి ఫోన్ చేసి పార్టీలోనే ఉండాలని కోరారు. మరోవైపు అక్కడ ఉన్న బీఆర్ఎస్, బీజేపీ నేతలు పోటాపోటీగా నినాదాలు చేశారు. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి వర్ధన్నపేట ఎమ్మెల్యే గా గెలిచిన ఆరూరి రమేశ్ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్ నాగరాజు చేతిలో ఓడిపోయారు. ఉమ్మడి వరంగల్ రాజకీయాలను ప్రభావితం చేయగలిగిన ఎస్సీ నేతగా రమేశ్‌కు గుర్తింపు ఉంది. ప్రస్తుతం బీఆర్ఎస్ వరంగల్ జిల్లా పార్టీ అధ్యక్షుడిగానూ కొనసాగుతున్నారు. ఓటమి తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ బలహీనపడుతుండటంతో పార్టీ మారాలని నిర్ణయించుకున్నారు.



## చెరువు సుందరీకరణకి రూ.2.90 కోట్లు మంజూరు

- కంటోన్మెంట్ బోర్డు అధికారులు సుందరీకరణకు శంకుస్థాపన

ఫోకస్ న్యూస్, కంటోన్మెంట్:

సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని ఏడో వార్డులో తిరుమలగిరిలోని ఎయిర్లైన్స్ లోపల ఉన్న విశాలమైన చెరువును ఆధునికరించేదుకు 2.90 కోట్లతో నిర్మాణ పనులను కంటోన్మెంట్ బోర్డ్ అధ్యక్షులు, బ్రిగేడియర్ సోమశంకర్,సీఈవో మధుకర్ నాయక్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ లు ప్రారంభించారు. చెరువు కబ్జా కాకుండా స్థానిక ప్రజల సౌకర్యార్థం వాకింగ్ ట్రాక్, ట్యాంక్బండ్ లాగా ఆధునికరించి స్థానిక ప్రజల సౌకర్యార్థం నిర్మాణాలు చేపట్టనున్నారు. ఈరోజు అధికారులు ఇబ్బంది కాలనీవాసులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడంతో స్థానికులు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎప్పటినుంచో ఈ పనులు పెండింగ్ ఉండటం వల్ల కబ్జాకు గురవడం లాంటి సంఘటనలు స్థానిక ప్రజలను ఆరోపిస్తున్నప్పటికీ క్రమంగా ఈ పనులు ప్రారంభం అవటంతో వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు మలాని ఎన్ క్లేవ్ ప్రెసిడెంట్ బాలరాజు, సత్యనారాయణ వెంకట్ రెడ్డి, వెంకట్ రమణ, శంకర్ పాల్గొన్నారు.



## విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ కార్పొరేషన్ పాలకవర్గం ఏర్పాటు చేయాలి

- జిల్లా గౌరవాధ్యక్షులు రావట్ల సత్యనారాయణ చారి
- మండల అధ్యక్షులు రావట్ల వెంకటాచారి

(నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి) మాగి ముఖేష్ బోనకల్లు మార్చి 13:

మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు రావుట్ల సత్యనారాయణచారి,మండల అధ్యక్షులు రావుట్ల వెంకటాచారి, జిల్లా ఉపాధ్యక్షులు పంతంగి శ్రీనివాసచారి, విలేకరి సమావేశంలో మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలగా ఇబ్బంది పడుతున్న విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ చేతివృత్తుల చేసేవారు ఇబ్బంది పడుతున్న గురించి తెలంగాణ విశ్వబ్రా హ్మణ విశ్వకర్మ ఫెడరేషన్ ఎం.డీ.మల్లయ్య భట్టు కార్యాలయంలోతెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మసంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్ల హన్మాండ్లు చర్చించడం జరిగింది.ఆయన మాట్లాడుతూ తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ కో-అపరటివ్ కార్పోరేషన్ లిమిటెడ్ఉత్తర్వులు 2015 లోనే జారీచేశారని ఆయన తెలియచేసారు. కనుక విశ్వబ్రా హ్మణులందరు కార్పోరేషన్ లేదని అనుకోవద్దు అని తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మసంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్ల హన్మాండ్లు జీవో కాపీని తీసుకున్నట్లుగా తెలియజేసి ఆనందం వ్యక్తం చేశారు అలాగే పాలకమండలి ఏర్పాటు చేయాలని రాష్ట ముఖ్యమంత్రి ఏనమల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లుబట్టి విక్రమార్కను కోరినారుఈ కార్యక్ర మంలో మండల గౌరవ అధ్యక్షులు కొండపర్తి వీరభద్రాచారి, మండల ప్రధాన కార్యదర్శి తాటికొండ విశ్వజ్ఞాచారి, మండలప్రచార కార్యదర్శి వజ్రాల రాధాకృష్ణమాచారి, కోశాధికారి నాచర్ల బ్రహ్మం, సహాయ కార్యదర్శి రావుట్ల లక్షణాచారి ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ అభివృద్ధికై ప్రత్యేక బడ్జెట్

- వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు
- కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వెన్నెల గద్దర్



ఫోకస్ న్యూస్, కంటోన్మెంట్ :

కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడో వార్డులో ఉన్న ఆశ ఆఫీసర్స్ కాలనీ సమీపములో ఉన్న ప్రధాన రహదారి సిసి రోడ్డు పనులను, 86 లక్షల రూపాయలు ఖర్చుతో పనులను కంటోన్మెంట్ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పోటీ చేసిన వెన్నెల గద్దర్, మాజీ బోర్డు ఉపాధ్యక్షుడు జయప్రకాష్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మర్రి అమరేందర్ రెడ్డి తదితరులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జీ వెన్నెల గద్దర్ మాట్లాడుతూ... కంటోన్మెంట్ కు రావలసిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం నుంచి 45 కోట్లు ఇటీవల మంజూరైనాయని, అందులో భాగంగా వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఇటీవల ఉపాధ్యాయ విద్యా శిక్షణ కేంద్రాన్ని బొల్లారంలో ప్రారంభించారని, బొల్లారంలో ఆసుపత్రిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నాని చెప్పారు. కంటోన్మెంట్ బోర్డు సిబ్బందికి జీతాలు కూడా సకాలంలో వస్తున్నాయని, ఇదంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవవల్లే బకాయిలు మంజూరైయాయని తద్వారా, నియోజకవర్గం అభివృద్ధి జరుగుతుందని ఆమె అన్నారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాష్, మర్రి అమరేందర్ రెడ్డి లు మాట్లాడుతూ.... రేవంత్ రెడ్డి గతంలో ఈ ప్రాంతంలో ఎంపీగా పనిచేయటం వల్ల, కంటోన్మెంట్ పై రేవంత్ రెడ్డికి అవగాహన ఉంది అని అన్నారు. కాబట్టి నియోజకవర్గం అభివృద్ధికి రావాల్సిన బకాయిలను ప్రభుత్వ నుండి మంజూరు చేస్తూ వివిధ అభివృద్ధి పనులకు సహకరిస్తున్నారని, నియోజకవర్గ ప్రజల తరపున సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## నంబూరి నరసింహారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేత

(నేటి ఫోకస్ న్యూస్) ప్రతినిధి మాగి ముఖేష్,బోనకల్లు మార్చి 13:

మండల కేంద్రంలో బోనకల్ లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థులు కు కాంగ్రెస్ పార్టీ నాయకులు నంబూరి నరసింహారావు ఆధ్వర్యంలో విద్యార్థి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి ని అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతమైన వాతావరణం లో పరీక్ష లు రాయాలని, చదువుకున్న పాఠశాలకు కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొని రావాలన్నారు, తెలియజేశారు. పాఠశాల సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





## మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

- రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



వనపర్తి ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్):

రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాలతో బాధపడుతున్న బాధితులకు వెంటనే వైద్యం అందించాలని మేఘారెడ్డి వైద్యులకు సూచించి మానవత్వం చాటుకున్నారు. బుధవారం 44వ జాతీయ రహదారిపై రాయిని పేట స్టేజి దగ్గర అప్పరాల గ్రామానికి చెందిన నరసింహ అనే వ్యక్తి బైక్ అదుపుతప్పి రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మరో వ్యక్తి రమేష్ తీవ్ర గాయాలతో బాధపడుతుండగా అటుగా వెళుతున్న మెగా రెడ్డి ప్రమాద తీవ్రతను గమనించి వెంటనే తన వాహనం ఆపి సంఘటన స్థలాన్ని సందర్శించారు. నరసింహ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతోపాటు రమేష్ కు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మెగా రెడ్డి బాధితుల పక్షాన స్పందించిన తీరును చూసిన పలువురు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## టిజిపిఏ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చాపలమడుగు నాగేశ్వరరావు

- సంస్కృతిక విభాగం కన్వీనర్‌గా చేపలమడుగు . కోటేశ్వరరావు ఏకగ్రీవం ఎన్నిక


(నేటి ఫోకస్ న్యూస్)ప్రతినిధి మాగి ముఖేష్,బోనకల్లు మార్చి 13:

తెలంగాణ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కమిటీ వేయడం జరిగింది. ఈ కమిటీలో చిరునోముల గ్రామానికి చెందిన చాపల మడుగు నాగేశ్వరరావు వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఖమ్మం జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గా చాపలమడుగు కోటేశ్వరరావు కోశాధికారిగా బోయన నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిజిపిఏ వ్యవస్థాపక సభ్యులు జాన్ కుమార్ రాష్ట్ర అధ్యక్షులు అంబాల ప్రభాకర్, పవన్ కుమార్,లోకేష్,కిన్నెర రాము, విజయ్ కుమారి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా టిజిపిఏ రాష్ట్ర అధ్యక్షులు అంబాల ప్రభాకర్ మాట్లాడుతూ గురుకులల్లో జరుగుతున్న పిల్లల ఆత్మహత్యల నివారణకు సమస్యల పరిష్కరించడానికి ముఖ్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

## అనారోగ్య బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే మెగా రెడ్డి

వనపర్తి ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్):

హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో వివిధ జబ్బులతో బాధపడుతున్న పలువురిని ఎమ్మెల్యే మెగా రెడ్డి బుధవారం నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. వనపర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నక్క రవి కిరణ్ యాదవ్, శ్రీనివాసపురం విభూది పెద్ద వెంకటయ్య రేవల్లి మండల కేంద్రానికి చెందిన టప్ప రాజయ్య లను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పించారు. అనంతరం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన విభూది పెద్ద వెంకటయ్య కు రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిపోగా వెంటనే ఆయనను ఆదుకునేందుకు ఎల్ఓసి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. మిగతా బాధితులకు అండగా ఉంటానని భరోసా కల్పించారు.



## మందకృష్ణ... మంద కొమురవ్వకి ఘన నివాళులు

- బోనకల్ మండల అధ్యక్షుడు మంద అశోక్ మాదిగ ఆధ్వర్యంలో

(నేటి ఫోకస్ న్యూస్) ప్రతినిధి మాగి ముఖేష్,బోనకల్లు మార్చి:

గౌ. శ్రీ మంద కృష్ణ మాదిగ కి జన్మనిచ్చిన మాతృమూర్తి కీ. శే మంద కొమురవ్వ తొమ్మిదవ వర్ధంతి సందర్భంగా బోనకల్ మండల కేంద్రంలో మంద అశోక్ మాదిగ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చిలకా నాగరాజు మాదిగ మాట్లాడుతూ జాతి విముక్తి కోసం యోధుడిని కని జాతికి అంకితమిచ్చిన మహాతల్లి, త్యాగమూర్తి మా మంద కొమురవ్వకు మాదిగ జాతి తరుపున నివాళులు తెలుపుతున్నాం.ఈ కార్యక్రమంలో ఎంఎస్పి జిల్లా కార్యదర్శి తాటికొండ వెంకటరత్నం, ఎమ్మెస్ పి జిల్లా నాయకులు తోటపల్లి చిన్న సైదులు, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రచార కార్యదర్శి బలవంతం నరసింహ,సోషల్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రి కంటి గంగాధర్, ఎమ్మెస్ ఎఫ్ నాయకులు నవీన్ పాల్గొన్నారు.



## ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటుపై సంఘం నాయకుల హర్షం

- ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వానికి కృతజ్ఞతలు

(నేటి ఫోకస్ న్యూస్) ప్రతినిధి మాగి ముఖేష్,బోనకల్లు మార్చి 13:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్ కార్పొరేషన్ ప్రకటించిన సందర్భంగా మండల కేంద్రంలో గల ప్రెస్ క్లబ్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఖమ్మం జిల్లా మత్స్యశాఖ సొసైటీల కన్వీనర్ బొమ్మకంటి సైదులు,మండల అధ్యక్షులు ఘనపారపు వెంకటేశ్వర్లు సీఎం రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి, జిల్లా మంత్రులకు ప్రత్యేక కృత్ణతలు తెలిపారు.ఈ సందర్భంగా బోమ్మకంటి సైదులు మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పాటుతో ముదిరాజ్ లకు ఆర్థికంగా లాభం చేకూరుతుందని పేర్కొన్నారు.గత ప్రభుత్వం ముదిరాజ్ లకు ఎన్నో హామీలను ఇచ్చి విస్మరించారని,కానీ నేడు సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం కాంగ్రెస్ పాలన యొక్క నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. కార్పొరేషన్లకు చైర్మన్ లను,డైరెక్టర్ నియమించాలని కోరారు.

## బ్రహ్మంచారికి ఎమ్మెల్యే మెగా రెడ్డి పరామర్శ

వనపర్తి ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్):

వనపర్తి పట్టణంలోని 14వ వార్డు కౌన్సిలర్ బ్రహ్మం చారిని మెగా రెడ్డి పరామర్శించి ధైర్యం కల్పించారు. గత రెండు రోజుల క్రితం కిడ్నీ స్టోన్ సమస్యతో బాధపడుతూ సికింద్రాబాద్ అపోలో ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మెగా రెడ్డి బుధవారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పించారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

## రోగ నిర్ధారణలో ల్యాబ్ టెక్నీషియన్‌లే కీలకం

- ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్):

వ్యాధి నిర్ధారణలో ట్యాబ్ టెక్నీషియన్ లే కీలకమని ఎమ్మెల్యే మెగా రెడ్డి అన్నారు. బుధవారం న్యూ జెనిక్ కంపెనీ ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్స్ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని సితార గ్రాండ్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూ జెనిక్ కంపెనీ తరపున ల్యాబ్ టెక్నీషియన్స్ కు డెమో ద్వారా మరింత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ల్యాబ్ టెక్నీషియన్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్స్ తమ హక్కుల సాధనకు సంఘటితంగా ముందుకు రావాలని మీకు ప్రభుత్వం తరపున ఎలాంటి అవసరం వచ్చినా తనను నేరుగా కలిసి విన్నవించాలని కోరారు. అనంతరం ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ తరపున ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్ కుమార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు విజయ చందర్ లకు శాలువాలు కప్పి ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మిస్బాహుద్దీన్, తిరుపతి రెడ్డి, అధ్యక్షులు అక్కల తిలకేశ్వర్ గౌడ్, సెక్రటరీ అల్తాఫ్, సభ్యులు కిరణ్ కుమార్ గౌడ్, మధు, శ్యామ్, సంజీవ్, భాస్కర్ పాల్గొన్నారు.






# రామాయణంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్



**నితేశ్ తివారీ దర్శకత్వంలో** బాలీవుడ్ ప్రొడ్యూసర్లతో కలిసి అల్లు అరవింద్ ప్రతిష్ఠాత్మకంగా రామాయణాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో రాముడిగా స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్ కనిపించనున్నారని టాక్ వినిపిస్తోంది. తాజాగా ఈ విషయంపై 'రామాయణ్' సీరియల్‌లో రాముడిగా నటించిన అరుణ్ గోవిల్ మాట్లాడారు. 'రణ్‌బీర్ గొప్ప నటుడు. తన యాక్టింగ్‌కు ఎన్నో అవార్డులు వచ్చాయి. చాలా కష్టపడి పనిచేస్తాడు. సంస్కారవంతుడు. నైతిక విలువలు కలిగిన వ్యక్తి. భారతీయ సంస్కృతిని గౌరవిస్తాడు. తన పాత్రకు వందశాతం న్యాయం చేయడానికి ప్రయత్నిస్తాడు. రాముడిగా కూడా ఉత్తమంగా నటిస్తాడని నా అభిప్రాయం' అని చెప్పారు. ఇక ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన ఏప్రిల్‌లో వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. శ్రీరామ నవమి సందర్భంగా సినిమాపై అప్‌డేట్ ఇవ్వనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇందులో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీ దేవోల్, కైకేయిగా లారా దత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు ఎన్నో రోజులుగా ప్రచారం జరుగుతోంది. దీని వీఎఫ్ఎక్స్ ఎఫెక్ట్‌ల కోసం నితేశ్ తివారీ టీమ్ ఆస్కార్ విన్నింగ్ కంపెనీ డీఎన్ఈజీతో సంప్రదింపులు జరిపిందట. ఈ చిత్రం కోసం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని వినియోగించాలని చిత్రబృందం యోచిస్తోందని అందుకే లుక్ టెస్ట్ కోసం కూడా త్రీడీ టెక్నాలజీని ఉపయోగించారని ప్రచారం సాగుతోంది.




## ఫ్యామిలీ స్టార్ నుంచి
### కళ్యాణి వచ్చా.. పాట విడుదల

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న కుటుంబ కథా చిత్రం 'ఫ్యామిలీస్టార్'. మృణాల్ ఠాకూర్ కథానాయిక. 'కల్యాణి వచ్చా వచ్చా...' అంటూ సాగే యుగళ గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, గోపీసుందర్ స్వరాలు సమకూర్చారు. మంగ్లీ, కార్తీక్ ఆలపించారు. శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ బేనర్‌పై దిల్‌రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పరుశురామ్ పెట్ల దర్శకుడు. ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కేయూ మోహనన్.




## లాల్‌సలామ్ ఫెయిల్యూర్‌కు కారణమిదే?

**అగ్ర కథానాయకుడు రజనీకాంత్** కీలక పాత్రలో నటించిన చిత్రం 'లాల్ సలాం' ఆయన కుమార్తె ఐశ్వర్య రజనీకాంత్ దీనికి దర్శకత్వం వహించారు. భారీ అంచనాలతో విడుదలైన ఈ చిత్రం అనుకున్న స్థాయిలో విజయాన్ని సాధించలేదు. తాజాగా దీనిపై ఐశ్వర్య ఓ షాకింగ్ విషయాన్ని వెల్లడించారు. 21 రోజుల షూటింగ్ ఫుటేజ్ పోయిందని దాని ప్రభావం సినిమా ఫలితంపై పడిందన్నారు. 'సినిమాలోని ప్రధాన భాగానికి సంబంధించిన షూటింగ్ ఫుటేజ్ మిస్సయింది. దాదాపు 21 రోజుల ఫుటేజ్ అది. పూర్తి బాధ్యతారాహిత్యం కార ణంగానే ఇలా జరిగింది. క్రికెట్‌కు సంబంధించిన సన్నివేశాలను 20 కెమెరాలతో నిజమైన మ్యాచ్‌లా షూట్ చేశాం. మా దురదృష్టం కొద్ది పోగొట్టుకున్నాం. మాకు ఏం చేయాలో అర్థంకాలేదు. అప్పటికే విష్ణు, నాన్న(రజనీకాంత్)తో సహా అందరూ గెటప్‌లు మార్చుకున్నారు. అందుకే రీ షూట్ చేయలేకపో యాం. చివరికి మిగిలి ఉన్న దానితో సినిమాను ఎడిట్ చేశాం' అని చెప్పారు.

## షరతులు వర్తిస్తాయి.. సెన్సార్ పూర్తి

చైతన్య రావ్, భూమి శెట్టి జంటగా నటించిన సినిమా 'షరతులు వర్తిస్తాయి' తాజాగా ఈ సినిమాకు సెన్సార్ ప్రశంసలు దక్కాయి. కుమారస్వామి(అక్షర) దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని స్టార్ లైట్ స్టూడియోస్ బ్యానర్‌పై శ్రీలత – నాగార్జున సామల, శారదా – శ్రీష్ కుమార్ గుండా, విజయ – డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మించారు. ఈ నెల 15న గ్రాండ్‌గా ఈ సినిమా విడుదల కాబోతోంది. తాజాగా ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ సినిమాకు సెన్సార్ సభ్యులు క్లీన్ యు సర్టిఫికెట్ జారీ చేశారు. ఈ సందర్భంగా మానవీయ విలువలు ఉన్న ఒక మంచి సినిమా రూపొందించారంటూ దర్శకుడు కుమారస్వామికి సెన్సార్ సభ్యులు ప్రశంసలు అందజేశారు. ఈ చిత్ర దర్శకుడు కుమారస్వామి కూడా సెన్సార్ బోర్డ్ సభ్యుడు అనే విషయం తెలియకుండానే బోర్డ్ మెంబర్స్ సినిమాను చూశారు. తర్వాత తమ సభ్యుడే ఇంత గొప్ప సినిమా తీయడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సినిమాపై సెన్సార్ బృందం స్పందిస్తూ.. తెలంగాణ సినిమా అనగానే కొన్నాళ్లుగా కనిపిస్తోన్న విపరీతమైన మద్యం సన్నివేశాలు, నిర్లక్ష్యపు ధోరణులకు భిన్నంగా 'షరతులు వర్తిస్తాయి'లో ఒక గొప్ప మానవీయ విలువలు చూపించారు. మానవ సంబంధాలతో నిండి ఉన్న ఇలాంటి సినిమాను ప్రతి ఒక్కరూ చూడాలని, తెలంగాణ నేపథ్యంలోనే కనిపించినా.. ఒక యూనిక్ కంటెంట్ ఈ చిత్రంలో ఉందని పేర్కొన్నారు. కాగా, ఈ సినిమాకు సంబంధించి ఇప్పటి వరకు విడుదలైన టీజర్, ట్రైలర్, సాంగ్స్ మంచి స్పందనను రాబట్టుకున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా 'పన్నెండు గుంజ లా పెళ్లి పందిరి' అనే పాట ప్రస్తుతం తెలంగాణలోని అన్ని పెళ్లి వేడుకల్లోనూ వినిపిస్తోంది. ఇప్పుడు సెన్సార్ బోర్డ్ నుంచి ప్రశంసలు దక్కడం సినిమా విజయం పట్ల మరింత నమ్మకాన్ని పెంచిందని ఈ సందర్భంగా నిర్మాత చెప్పుకొచ్చారు.



# ప్రేమలు సినిమా చూసి ఆనందించా: మహేశ్ బాబు

**రీసెంట్‌గా విడుదలై.. బాక్సాఫీస్** వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోన్న చిన్న సినిమా 'ప్రేమలు' పై సోషల్ మీడియా వేదికగా సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రశంసల వర్షం కురిపించారు. చాలా రోజుల తర్వాత ఈ సినిమా చూస్తూ హాయిగా నవ్వుకున్నట్లుగా ఆయన చెప్పుకొచ్చారు. ఫిబ్రవరి 9న విడుదలైన మలయాళ చిత్రం 'ప్రేమలు' అక్కడ బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ఈ మూవీకి మంచి ప్రశంసలు దక్కాయి. మంచి కామెడీ, లవ్ అనే అంశాలతో 'ప్రేమలు' సినిమా స్టోరీ లైన్, దాన్ని తెరకెక్కించిన విధానాన్ని ప్రేక్షకులు అద్భుతమని మెచ్చుకున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు పాన్ ఇండియా డైరెక్టర్ ఎస్.ఎస్.రాజమౌళి తనయుడు ఎస్.ఎస్. కార్తికేయ అందించారు. మార్చి 8న విడుదలైన ఈ మూవీ తెలుగు వెర్షన్‌కు.. విడుదలైనప్పటి నుండి చాలా మంచి స్పందన వస్తోంది. సినిమా చూసిన ప్రముఖులెం దరో ఈ సినిమాను కొనియాడుతున్నారు. తాజాగా ఈ చిత్రాన్ని చూసిన సూపర్ స్టార్ మహేష్ బాబు.. సోషల్ మీడియా వేదికగా సినిమాను, సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందించిన కార్తికేయ ను అభినందించారు. తెలుగు ప్రేక్షకులకు 'ప్రేమలు' చిత్రాన్ని అందించిన కార్తికేయకు ధన్యవాదాలు. బాగా ఎంజాయ్ చేశాను. చివరిగా నేను ఏ సినిమా చూసి ఇలా ఎంజాయ్ చేశానో గుర్తు లేదు. ఫ్యామిలీ మొత్తానికి ఈ సినిమా బాగా నచ్చింది. సినిమాలో నటించిన ప్రతి ఒక్కరూ అద్భుతమైన నటనను కనబరిచారు. టీమ్ మొత్తానికి నా అభినందనలు అని సూపర్ స్టార్ మహేష్ బాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ పోస్ట్‌కు లైక్స్, కామెంట్స్‌కి అయితే లెక్కే లేదు. ఒక మంచి సినిమాను ప్రమోట్ చేయడానికి, ఒక మంచి సినిమాను ప్రేక్షకులకు చేరవేయడానికి మహేష్ బాబు ఎప్పుడూ ముందుంటారని మరోసారి నిరూపించారంటూ.. అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.



